# సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేస్తా

- ప్రజల ఆశీర్వాదంతో గజ్వేల్, సిద్దిపేట తరహాలో గ్రామాల్లో ప్రగతిని పరుగులు పెట్టిస్తా
- సమస్యలుంటే మధ్యవర్తితో అవసరం లేదు.. నేరుగా నన్నే కలువొచ్చు
- బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించి విపక్షాలకు గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బచ్చన్నపేటలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి



బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

బచ్చన్నపేట, అక్టోబర్ 13 : ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తనపై ఉన్న నమ్మకంతో బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపిక చేసి నన్ను ఇక్కడికి పంపారని, ప్రజలంతా ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలించాలని జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. నన్ను కలువడానికి మధ్యవర్థులు, నాయకులు అక్కర్లేదని, నేరుగా ఎవరికి సమస్య ఉన్నా వారే కలువొచ్చన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని శాసనమండలి మాజీ చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీనిధి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామలో మూడు రోజుల క్రితం జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి వేలాది మంది హాజరై తనకు తోడ్పాటు అందించారని అన్నారు. సభ సక్సెస్ ఎంతో సంతోషాన్నించిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో 10 రోజులు జైల్లో ఉన్నానని, 11 కేసులు పెట్టారని గుర్తు చేశారు. తనను ఉద్యమ ద్రోహి అని కాంగ్రెస్ నాయకులనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీఎంతో తనకున్న సాన్నిహిత్యంతో ఎక్కువ నిధులు తెప్పించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తానని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీల కోరిక మేరకు రూ.4 కోట్లు కేటాయించానని, జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేశానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో ఏఏ అవసరాలు ఉన్నాయో సీఎం సభ తర్వాత తెలియజేస్తే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. బీఆర్ఎస్‌లో కుదిరిన సయోధ్యను విపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని అన్నారు. మన బలగం, బలం సీఎం కేసీఆర్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ముందుకు నడుస్తానన్నారు. బచ్చన్నపేటలో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారని, తాను గెలిచాక మంజూరు చేయిస్తానన్నారు. మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు సలహాలు, సూచనలు తీసుకుంటానని, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సహకారంతో ఎన్నికల్లో విజయం సాధిస్తానన్నారు. ఈ నెల 16న జనగామలో నిర్వహించే సీఎం సభకు వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.

**పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలి : బోడకుంటి**

సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడైన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని శాసనమండలి మాజీ చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీలో తనతో కలిసి పదేళ్లకుపైగా పని చేస్తూ వస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు చేసి పెట్టడంతో తపన ఉండే వ్యక్తి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సీఎం దగ్గర పని చేయాలంటే ఎంతో టెన్షన్ ఉంటుంది. అయినా ఇన్నాళ్లు అధినేత ఆదేశాలకనుగుణంగా పనిచేస్తున్నారని తెలిపారు. జనగామ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చి సీఎం కేసీఆర్ గౌరవించారని అన్నారు. జనగామకు సరైన నాయకుడు పల్లా అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. సీఎం కేసీఆర్‌కు బచ్చన్నపేట అంటే అమితమైన ప్రేమ అన్నారు. వారి సహకారంతోనే నేడు ఈ ప్రాంతానికి గోదావరి జలాలు వస్తున్నాయని, బీడు భూములకు సాగునీరందుతున్నదన్నారు. 'మిషన్ భగీరథ'లో మొదటి దశలోనే ఈ ప్రాంతానికి తాగునీరు అందిందన్నారు. ఈ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బోడకుంటి వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతీకృష్ణంరాజు, రాష్ట్ర నాయకులు జల్లి సిద్ధయ్య, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరంల మండలాల అధ్యక్షులు గంగం సతీశ్‌రెడ్డి, కనకయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు రాధ, కోఆప్షన్ సభ్యులు షబ్బీర్, యూత్ అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరేందర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ ఫిరోజ్, వైస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, బచ్చన్నపేట సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు బాల్‌రెడ్డి, వెంకట్, మల్లేశం, రవీందర్‌రెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, మల్లవరం వెంకటేశ్వర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, సిద్ధారెడ్డి, భాస్కర్, శ్రీధర్, శశిధర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, దస్తగిరి, జావీద్, వినోద్, కైసర్, నర్సింహులు, ప్రతాప్‌రెడ్డి, వేముల బాలరాజు, బాగులు, తిరుపతిగౌడ్, బాలమల్లు, జిల్లా సందీప్‌కుమార్, ఇమ్మడి జితేందర్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాస్, ఐలయ్య, వేణుగోపాల్, రాజు, శివకుమార్, ఆంజనేయులు, సిద్ధిరాములు, కరుణాకర్, వేముల లక్ష్మణ్, చిట్టిబాబు, కోనేటి స్వామి, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై

# అవగాహన కలిగి ఉండాలి

- నిబంధనలు తప్పకుండా పాటించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

జనగామ చౌరస్తా, అక్టోబర్ 13 : ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శాసనసభ ఎన్నికల నిర్వహణపై సంబంధిత ఉద్యోగులకు ఎన్నికల అధికారి శివలింగయ్య నేతృత్వంలో మాస్టర్ ట్రెయినర్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. మీడియా సెల్ మానిటరింగ్ కమిటీ సిబ్బందికి నోడల్ అధికారులు అనిల్ కుమార్, హౌసింగ్ ఈఈ దామోదర్‌రెడ్డి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శివలింగయ్య మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సీ–విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులైనా నమోదు చేయొచ్చని శివలింగయ్య పేర్కొన్నారు. సంబంధిత ఫిర్యాదుపై వెంటనే జిల్లా ఎన్నికల అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. దీని కోసం సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బంది అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. మీడియా మానిటరింగ్ సెల్‌లో 24 గంటలు సిబ్బంది మూడు దఫాలుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. లోకల్ కేబుల్ టీవీ చానల్స్, జిల్లా దినపత్రికల్లో వచ్చే అభ్యర్థుల ఎన్నికల ప్రచార వార్తలను సిబ్బంది పరిశీలిస్తారని పేర్కొన్నారు. అనంతరం సెక్షన్ల వారీగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న విభాగాలను జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య తనిఖీ చేశారు. ఎన్నికలకు సంబంధించిన పనులు పారదర్శకంగా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆయన సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య



క్రీడాకారులను అభినందిస్తున్న బరుపాటి గోపి

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఆదివారం వరకు 67వ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఈ పోటీలకు అండర్–19 విభాగంలో ఎన్నికైన క్రీడాకారులను వరంగల్ ఎస్జీఎఫ్ఐ అండర్–19 ఆర్గనైజింగ్ సెక్రటరీ బరుపాటి గోపి, ఏవీవీ కాలేజీ ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ సాంబయ్య, రగ్బీ కోచ్ శ్రీకాంత్, హఫీజ్, శ్రీలత, నాగరాజు తదితరులు అభినందించారు. మహిళల విభాగంలో కృష్ణవేణి, వర్షిణి, పాలశ్రీ, నందిని, సారిక, సంధ్య, స్పందన, అనూష, శ్రావణి, హారిక, సాయిరచన, పురుషుల విభాగంలో విఘ్నేశ్, సంజయ్‌కుమార్, రాజ్‌కుమార్, అజ్రిల్ల, రోహిత్, వీరన్న, సంతోష్, ఇర్ఫాన్, జాకీర్, సూర్య, లోకేశ్, ప్రసాద్ ఎంపికయ్యారు.

# ఆర్టీసీ 'దసరా' బంపర్ ఆఫర్

**బతుకమ్మ, దసరాకు 800 ప్రత్యేక బస్సులు**
**ఆర్టీసీ ఆర్ఎం జే శ్రీలత**

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13: హనుమకొండ బస్‌స్టేషన్‌లో పండుగ సందడి నెలకొంది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వరంగల్ రీజియన్ పరిధిలో 800 ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈనెల 25 వరకు రీజియన్ పరిధిలో ఆర్టీసీ స్పెషల్ సర్వీసులను నడపనుంది.

**ఒక్కో లక్కీడ్రాతో నగదు బహుమతి**

దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ అదిరిపోయే బంపర్ ఆఫర్ అందిస్తోంది. ఈ పండుగ సీజన్‌లో ప్రయాణించినవారికి భారీగా బహుమతులు అందించనున్నట్లు ప్రకటించింది. బహుమతులు గెల్చుకోవడానికి ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల ప్రయాణికులు తమ పూర్తి పేరు, ఫోన్ నెంబర్‌ను రాసి ఆయా బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌ల్లో వేయాలని సూచించింది. రాఖీ పండుగ మాదిరిగానే దసరాకు లక్కీడ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి, వారిని ఘనంగా సత్కరించాలని ఆర్టీసీ నిర్ణయించింది. రూ.11 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించింది. వరంగల్ రీజియన్‌లో ఐదురుగు పురుషులు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున నగదు బహుమతులను అందించనున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు, మళ్లీ 28 నుంచి 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారంతా లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు

**స్పెషల్ ఆఫర్ 10 శాతం రాయితీ**

ఆర్టీసీ దసరా పండుగ సందర్భంగా అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది. పండుగ సందర్భంగా ఇళ్లకు వెళ్లే వారు ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఈ నెల 15 నుంచి 30 మధ్యలో ప్రయాణానికి రానుపోను ఒకేసారి టికెట్లు బుకింగ్ చేసుకుంటే, తిరుగు ప్రయాణంపై 10 శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించింది. రిజర్వేషన్ సదుపాయం ఉన్న అన్నీ సర్వీసుల్లో రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

**పండుగకు అదనపు బస్సులు..**



బతుకమ్మ, దసరాకు 800 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తున్నాం. పండుగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను నడిపిస్తాం. పండుగ సందర్భంగా ఈనెల 21 నుంచి 23 వరకు, మళ్లీ 28 నుంచి 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రాలో నగదు బహుమతులు అందిస్తాం. **– జే శ్రీలత, ఆర్టీసీ ఆర్ఎం**

## జాతీయ క్రీడల్లో సత్తా చాటాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13 : గోవాలో జరిగే 37వ జాతీయ క్రీడల్లో తెలంగాణ రెజ్లర్లు రాణించి, సత్తా చాటాలని హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడల్లో పాల్గొనే తెలంగాణ రెజ్లర్ల ఎంపిక పోటీలు జేఎన్ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ జాతీయ క్రీడల్లో పాల్గొనే రెజ్లర్లకు అన్ని సౌకర్యాలను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం మాట్లాడుతూ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడ్‌హక్ కమిటీ ఆదేశానుసారం రాష్ట్ర సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రెజ్లర్ల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న మహ్మద్ కరీం

## రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

హనుమకొండ, అక్టోబర్ 13 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని పద్మాక్షి దేవాలయంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకులు నాగిళ్ల శంకరశర్మ, వేద పండితుడు బ్రహ్మశ్రీ నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని, ప్రచార కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి 23 వరకు వివిధ అలంకరణలతో పాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. 24న ఉదయం మహస్నపనము, సాయంత్రం రథోత్సవం, 25న ఉదయం పద్మాక్షిదేవి శాంతి కల్యాణం, సాయంత్రం తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**రెడ్డికాలనీ శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో..**

హనుమకొండ చౌరస్తా : రెడ్డికాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి 24 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముప్పిడి విజయకుమార్‌రెడ్డి, కార్యదర్శి బత్తిని వెంకటయ్య తెలిపారు. డాక్టర్ కే బుచ్చిరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.